# ప్రతీకారం

జె.వి.బాబు

హఠాత్తుగా ఊడిపడిన క్రైమ్ బ్రాంచ్ ఏసిపి విఠల్‌ని చూసి, సి.ఐ. చరణ్ కంగారుపడ్డాడు. కుర్చీలో నుండి లేచి సెల్యూట్ చేస్తూ "గుడ్ మార్నింగ్ సార్"అన్నాడు.

"గుడ్ మార్నింగ్" అతడిని కూర్చోమని సైగ చేస్తూ, టేబుల్ ఎదురుగా వున్న మరో కుర్చీలో కూర్చున్నాడు ఏ.సి.పి. "ఇన్‌స్పెక్టర్? నాకో సహాయం చేయాలి" ముఖంలోకి చూస్తూ పలికాడు.

క్రైమ్‌బ్రాంచ్ ఏసిపికి తను చేయగలిగిన సహాయం ఏమిటో అర్థంకాకపోయినా ఇంచుమించు కమిట్ అయిపోతున్నట్టు "చెప్పండి సార్" అడిగాడు.

విఠల్ ఓ పోస్ట్‌కార్డ్ సైజ్ ఫొటో జేబులో నుండి తీసి అతడి ముందుంచి చెప్పాడు. "ఇన్‌స్పెక్టర్ నువ్వే అమ్మాయిని అరెస్ట్ చేయాలి."

కొద్ది క్షణాలపాటు తన చెవులను తనే నమ్మలేనట్టు అదోలా ముఖం పెట్టాడు చరణ్. తేరుకున్నాక అనుమానంగా అడిగాడు. "ఈ అమ్మాయిని నేనే ఎందుకు అరెస్ట్ చేయాలి సార్?!... మీ డిపార్ట్‌మెంట్ కూడా అరెస్ట్ చేయొచ్చుగా?!"

అతడు తల పంకించాడు. "చేయొచ్చు. బట్, ... క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేయాలంటే పెద్ద కారణం వుండాలి. అదే మీరైతే రోడ్ పక్కన న్యూసెన్స్ కేస్ కింద కూడా అరెస్ట్ చేయొచ్చు... అవునా?!..."

"కరెక్టేననుకోండి. కాని సార్..." అంటూనే ఆ ఫొటో చేతిలోకి తీసుకున్నాడు. పాతికేళ్ళ అందమైన అమ్మాయి ఫొటో అది. వెనుక అడ్రస్ కూడా రాసి వుంది.

చరణ్ అయిష్టతను గమనించినట్టుగా, విఠల్ భరోసా ఇచ్చాడు. "అవసరమైతే కమీషనర్‌తో మాట్లాడుతాను. ముందు నువ్వు ప్రొసీడ్ అవ్వు."

"అలాగే సార్" తప్పదని తెలిసి ఒప్పుకున్నాడు సి.ఐ చరణ్.

❊ ❊ ❊


కాలింగ్ బెల్ నొక్కిన అర నిముషం తర్వాత తలుపు తెరుచుకుంది. ఫొటోలోని ఆ యువతి తలుపు తెరుస్తుందేమోనని అలర్ట్‌గా వున్నాడు సి.ఐ చరణ్. కాని తలుపు తెరిచిన ముసలావిడను చూడగానే అతడిని నీరసం ఆవరించింది. కాసింత తటపటాయించాక ప్రశ్నించాడు. "మేడమ్ వున్నారా?"

ముసలావిడ అతడికేసి కాస్త చిరాగ్గా చూసి అడిగింది. "ఏ మేడమ్?"

అప్పటికి గాని అతడికి తను మఫ్టీలో వున్న విషయం గుర్తుకు రాలేదు. యూనిఫామ్‌లో లేకపోవడంవల్లే ఆమె తనకేసి అలా చూస్తోంది. ఫొటో వెనుక రాసి వున్న పేరు గుర్తుకు తెచ్చుకున్నాడు. "ఆఁ!... దేవసేన..."

ఆవిడ ముఖంలో కాసింత ప్రసన్నత. తెలిసిన వాళ్ళే నన్న భరోసా. అందువల్లే కాబోలు చెప్పింది. "మేడమ్ మినిస్టర్ నాగరాజు గారింటికెళ్ళారు. సాయంత్రం వస్తే కలుస్తారు."

చరణ్ గొంతులో తడారింది. 'మినిస్టర్‌తో పరిచయమున్న వ్యక్తి. అలాంటి వాళ్ళను నేరం చేసినప్పుడు అరెస్ట్ చేయడమే కష్టం. అలాంటిది ఏ నేరం చేయకుండా...?!' అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని "సరే! సాయంత్రం కలుస్తా" అనేసి అక్కడి నుండి బయటపడ్డాడు.



వీధిలోకి రాగానే సెల్‌ఫోన్ తీసి ఏసిపి విఠల్‌కి ఫోన్ చేసాడు. "సార్! దేవసేన బాగా పలుకుబడి కలిగిన లేడీ. క్రైమ్ చేసినా తనను అరెస్ట్ చేయడం అంత సులభం కాదనే అనుకుంటున్నాను."

పది సెకనుల నిశ్శబ్దం తర్వాత అవతలి వైపు నుండి వినిపించింది. "సరే! ఓ పనిచెయ్యండి ఇన్‌స్పెక్టర్... మరోసారి నా ఆఫీస్‌కి రండి."

'ఈ గొడవలన్నీ నాకవసరమా?' అన్నమాట నోటి చివర వరకూ వచ్చింది. ఐతే మనసులో కదలాడుతున్న క్యూరియాసిటీ అలా అనేలా చేసింది. "అలాగే సార్! ఓ అర్థగంటలో అక్కడుంటాను."

వీధి చివర ఆపిన తన బైక్ వైపు నడుస్తూ మనసులో అనుకోసాగాడు. 'డబ్బు పలుకుబడి వున్న అందమైన అమ్మాయిని ఏ కారణం లేకుండా అరెస్ట్ చేయాలని క్రైమ్ బ్రాంచ్ ఏసిపి ఎందుకు ప్రయత్నిస్తున్నట్టు?! ఆమెను అరెస్ట్ చేస్తే ఆ తదనంతరం ఎదురయ్యే పరిణామాలు అతడూహించలేకపోతున్నాడా?!... ఊహు!! ఇప్పుడే వెళ్ళి ఆయన ఆమెను ఎందుకు అరెస్ట్ చేయించాలనుకుంటున్నాడో, అడిగి తెలుసుకోవాలి!

అతడు ఏసిపి ఆఫీస్ చేరేసరికి తన కోసమే ఎదురు చూస్తున్నట్టు సీట్లోనే వున్నాడు విఠల్. "కూర్చో" అతడికి కుర్చీ చూపించాడు.

చరణ్ తను వెళ్ళటం, ఆమె గురించి అందిన ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ వివరించాక ప్రశ్నించాడు. "అంత పలుకుబడి వున్న లేడీని, నేరం చేయకుండానే అరెస్ట్ చేస్తే మనకు ప్రమాదం కాదా?!"

విఠల్ అదోలా నవ్వాడు. "ప్రమాదం కాదు- ప్రమోదం... మనం చిన్న చిన్న లంచాలకు పాల్పడనవసరం లేనంత గన్ షాట్ లాంటి కేసిది. జస్ట్! అరెస్ట్ చేయబోతున్నట్టో, అరెస్ట్ చేసో బెదిరిస్తే చాలు, లక్షల్లో డబ్బు మన ముందుంటుంది... తెలుసా?!..."

అతడికి గొంతు తడారింది. గుటకలు మింగుతూ అడిగాడు "ఎలా?!"

విఠల్ తల అడ్డంగా ఆడించాడు. "ఇప్పుడే చెప్పను. ... ఆమెను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకురాగానే 'నీకేం కావాలంటూ బేరం పెడుతుంది... అప్పుడు ఈ పేపర్స్ తనకు చూపిస్తే చాలు... చెప్పానుగా! ఆ తర్వాత కోట్లే కోట్లు..."

అతడికి విషయం కొంతవరకూ అర్థమయ్యింది. 'దేవసేన కనిపించినంత సామాన్యురాలు కాదు. తన వెనుక పెద్ద నేర సామ్రాజ్యమే వున్నట్టుంది. దానికి సంబంధించిన ఆధారాలు ఈ ఏసిపికి దొరికినట్టున్నాయి... 'విఠల్ అందించిన కవరు అందుకున్నాడు. "ఓ.కే. సార్! విషయం చాలావరకూ అర్థమయ్యింది. ఇక చూస్కోండి... "లేచి పదడుగులేసాక, వెను తిరిగి పలికాడు"... అన్నట్టు ఈ విషయం కమీషనర్ వరకూ వెళ్ళలేదు కదా?!"

"లేదు... డీల్ మన మధ్యే వుండాలని కోరుకున్నాను."

"థాంక్యూ సార్."

❊ ❊ ❊

"రండి... మేడమ్ స్నానం చేస్తున్నారు. ... హాల్లో కూర్చుంటే, పది నిముషాల్లో వచ్చేస్తారు... "తలుపు తెరిచిన ముసలావిడ అతడిని చూస్తూ పలకింది.

సి.ఐ. చరణ్ లోపలికి నడిచాడు. సోఫాలో కూర్చుని చుట్టూ పరిశీలనగా చూడసాగాడు.

పది నిముషాల తర్వాత ముక్కును తాకిందా పరిమళం. మనసంతా గాల్లో తేలుతున్న ఫీలింగ్.

వెనువెంటనే వినిపించిన అడుగుల సవ్వడి అతడి చూపులు పక్కకు తిప్పేలా చేసింది. 'ఫొటోలోకన్నా ఈమె మరింత అందంగా వుంది' మనసులోనే అనుకున్నాడు.

దేవసేన అతడికి ఎదురుగా కూర్చుని ప్రశ్నించింది. "ఎవరు మీరు?!" ఏం కావాలి?

ఆమె కూర్చున్న తీరు, అడిగిన విధానం చూసాక

అతడు నీళ్ళు నమిలాడు. "అది... అది... నేను మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి వచ్చాను."

కనుబొమలు ముడివేసిందామె. "ఎ... ఎందుకు?" అడిగింది.

ఆమె ముఖంలో కనపడిన భయం అతడు తేరుకునేలా చేసింది. కాని- మొదట తను ఏదో కారణం చూపి అరెస్ట్ చేద్దామనుకున్నాడు. ఇప్పుడు లాఠీ-లాభం లేదు, రివాల్వర్ ఉపయోగించాల్సిందేనని అర్థమయ్యింది. అందుకే జేబులోనుండి ఆ కవర్ తీసి ఆమెకు అందిస్తూ చెప్పాడు. "ఇవిగో కొన్ని ఆధారాలు మాకు దొరికాయి."

ఆ కవరు అందుకుంది. అందులోనుండి కొన్ని కాగితాలు చూడగానే ఆమె ముఖంలో రంగులు మారాయి. పెదవులు వణకుతుంటే, అదుపు చేయడంకోసం కింది పెదవిని పై పంట కింద నొక్కి పెట్టింది.

అతడుకూడా ఆ కవర్‌లోని పేపర్స్ చూసాడు. ఏవో కొన్ని గ్రాఫులు, ప్రింటింగ్ లెటర్స్ వున్నాయి. అవేమిటో తనకూ అర్థంకాలేదు. కాని ఓ నేరానికి సంబంధించినవి- అన్నది మాత్రమే అర్థమయ్యింది.

అప్పుడే ఆమె అడిగింది. "ఈ... పే...పర్స్... మీకెక్కడివి?"

భయపడే వ్యక్తికి చూస్తే పోలీస్ మరీ రెచ్చిపోతాడేమో! ఆమె భయపడడం తెలిసాక, అతడికి రెట్టింపు ధైర్యం వచ్చింది. "నేరాలకు సంబంధించిన ఆధారాలు పోలీసులకు మాత్రమే దొరుకుతాయి."

"మీరు పోలీసులే... కరెక్టే!... బట్,..." ఆమె చప్పున రెండు చేతుల మధ్య తలపెట్టుకుని ఏడవసాగింది.

ఐదు నిముషాలపాటు ఆమెను ఏడవనిచ్చాక అతడు అన్నాడు. "మనమిక పోలీస్‌స్టేషన్‌కి వెళ్దామా?!"

"పో... పోలీస్‌స్టేషన్‌కా?!..." ఆమె తలెత్తి అతడి ముఖంలోకి చూసింది.

పది సెకనుల తర్వాత రెండు చేతులూ జోడించింది. "...ప్లీజ్! నాకు... నాకొక్కరోజు టైమివ్వండి. రేపు మళ్ళీ మనం కలుద్దాం... అప్పుడు... అలాగే నన్ను అరెస్ట్ చేయండి".

లేడి పరుగెడుతుంటే వేటాడే పులికి మరింత హుషారొస్తుంది. ఆమె చేతులు జోడించి ప్రాధేయపడుతుంటే, అతడి అహం సంతృప్తిపడుతున్నట్లనిపించింది. 'నిజానికి తన ఉద్దేశ్యం కూడా ఆమెను అరెస్ట్ చేస్తానని బెదిరించడమే తప్ప, అరెస్ట్ చేయడం కాదు. ఆమెను అరెస్ట్ చేస్తే తనకేమొస్తుంది?!...'

ఐనా అతడు తల అడ్డంగా ఆడించాడు."లేదు. నువ్విప్పుడే పోలీస్‌స్టేషన్‌కి రావాలి..." మనసులో నవ్వుకుంటూనే సీరియస్‌గా అన్నాడు.

"ప్లీజ్!... ఈ రాత్రికి నేను మీతో మాట్లాడుతాను. ఒకవేళ అప్పటికీ మీరు నన్ను అరెస్ట్ చేయదలచుకుంటే..."ఆమె అర్థోక్తిగా ఆపింది.

ఆమె ఇచ్చిన హింట్ అతడికి అర్థమయ్యింది. కాని జాలిపడుతున్నట్టుగా నటిస్తూ "సరే! మీకు పన్నెండు గంటలు టైమిస్తున్నాను. ఈలోపు పారిపోయే ప్రయత్నం చేసినా, మరోటి చేసినా... ఆ తర్వాత ఏం జరుగుతుందో నేను చెప్పను..." ఆమె చేతిలోని కవర్ లాక్కుని బయటకు నడిచాడు.

* * *


ఆ రాత్రి పాతిక కాల్స్ పైగా చేసిందామె. ప్రతి కాల్‌కి వేడికోలు... తను ఏమివ్వగలదో వివరణ.

ఫోన్ కాల్స్‌ని ఓ ఆటలా అతడు ఎంజాయ్ చేసాడు. అంతే తప్ప ఆ కవర్‌లోని మ్యాటర్ ఏంటో అంతగా పట్టించుకోలేదు. మాటల మధ్య ఆ ప్రస్తావన తీసుకొచ్చినా ఆమె 'మీకు ఏం కావాలో చెప్పండి. అంతే తప్ప అందులో ఏముందో అడక్కండి'అనేది.

బేరం ఐదు లక్షల దగ్గర మొదలయ్యింది. కొద్ది సేపటికే యాభై లక్షల వరకూ చేరుకుంది. ఐతే అతడు కమిట్ కాకుండా విఠల్‌కి ఫోన్ చేసాడు.

"సార్! తన దగ్గర 'నలభై లక్షల'కు మించి లేవంటోంది... ఏం చేయమంటారు?!"

"కోటి రూపాయలకు తగ్గితే అరెస్ట్ తప్పదని బెదిరించు."



**లేడి పరుగెడుతుంటే వేటాడే పులికి మరింత హుషారొస్తుంది. ఆమె చేతులు జోడించి ప్రాధేయపడుతుంటే, అతడి అహం సంతృప్తిపడుతున్నట్టనిపించింది. 'నిజానికి తన ఉద్దేశ్యం కూడా ఆమెను అరెస్ట్ చేస్తానని బెదిరించడమే తప్ప, అరెస్ట్ చేయడం కాదు. ఆమెను అరెస్ట్ చేస్తే తనకేమొస్తుంది?!...'**

"సరే సార్."

మరికాసేపటికి కాల్ చేసిన దేవసేనకు అతడు చెప్పాడు. "కోటీపాతిక లక్షలకు పైసా తగ్గినా ఒప్పుకునేది లేదు."

ఆమె దిగాలుగా పలికింది. "నా దగ్గర కోటీ పది లక్షలు మాత్రమే వున్నాయి. అంతకుమించి నేనేమీ ఇవ్వలేను."

అతడు అర నిముషం తర్వాత చెప్పాడు. "ఒకే. కోటీ పది లక్షలతోపాటు నాకు మరోటి కావాలి. అదిస్తే... ఈ డీల్ ఒకే"

"ఏమిటి?"

"నీ అందం."

"యూ స్టుపిడ్" ఫోన్ కట్ చేసింది దేవసేన.

అలా కట్ చేసిన ఫోన్ మరికాసేపట్లోనే మ్రోగుతుందని అతడికి తెలుసు.

అతడి అంచనా తప్పలేదు. ఫోన్ మ్రోగింది. ఆమె అయిష్టంగా "ప్లీజ్! నాకది ఇష్టంలేదు" అంది.

"నాకిష్టం" చరణ్ కవ్వింపుగా నవ్వాడు.

"స...రే..." క్షణమాగి చెప్పిందామె"... కాని ఇంట్లో కాదు. సిటీకి దూరంగా... క్యాష్ అందించేది, రొమాన్స్ అనుభవించేది. అక్కడే"

"యాజ్ యూ లైక్."

* * *

సిటీకి దూరంగా వున్న ఫామ్‌హౌస్‌ని బుక్ చేసాడు చరణ్. మిత్రుడి కారు తీసుకుని దేవసేనను ఆమె ఇంటి దగ్గర పికప్ చేసుకున్నాడు. కారెక్కుతున్న దేవసేన చేతిలోని సూట్‌కేస్ చూసాక అతడి పెదాలమీద చిరునవ్వు కదలాడింది. తన వాటా యాభై లక్షలు... పైగా పసందైన విందును అందిస్తున్న అందం...'

కారు వేగంగా ఫామ్‌హౌస్ వైపు దూసుకెళ్ళింది.

ఫామ్‌హౌస్ లోపలికి ప్రవేశించగానే అతడు ఆమె నడుము చుట్టూ చేతులేసాడు. గట్టిగా హత్తుకుపోతుంటే ఆమె గొణిగింది. "డబ్బు లెక్కపెట్టుకోవా?"

"ముందు నీ వంపు సొంపుల కొలతలు చూడనీ." మత్తుగా మూలిగాడు.

అతడు తన్మయత్వంగా ఆమెను తడుముతూ వున్నప్పుడే, గుండెల దగ్గర చురుక్కుమన్న మంట... వెను వెంటనే వెచ్చని తడి శరీరాన్ని తాకిన అనుభూతి.

... నీరసంగా చేతులు జారుతున్నప్పుడే ఆమె అతడిని గట్టిగా తోసింది. అతడు నేలమీద విరుచుకుపడుతూ కళ్ళు పెద్దవి చేసి, ఆమెనే చూడసాగాడు.

దేవసేన అతడి పక్కనే మోకాళ్ళ మీద కూర్చుంది. "ఏరా!... నేనెవర్నో నీకు తెలియదు కదూ?!... గుర్తు తెచ్చుకో. సంవత్సరం క్రితం ఓ అమ్మాయి రైల్వేస్టేషన్‌లో దిగి ఒంటరిగా నిలబడితే, జీప్‌లో తీసుకెళ్ళి రేప్ చేసి చంపి పడేసావ్. ఎవరో ఇద్దరు అమాయకుల్ని తీసుకొచ్చి కేసులో ఇరికించి, ఆ కేసుని పక్కదారి పట్టించావ్... ఇంతకీ చనిపోయింది ఎవరో తెలుసా? నా చెల్లెలు. ఏసిపి విఠల్‌కి అన్నయ్య కూతురు. మా బాబాయ్ నీ గురించి డీటైల్స్ సేకరించాడు. డిపార్ట్‌మెంట్‌లో వుంటూ నువ్వు చేస్తున్న దారుణాలు తెలిసాక, ఆయన నీకు కఠినమైన శిక్ష విధించాలనుకున్నాడు... ఇదే నీకు సరైన శిక్ష... బై"

అతడి ప్రాణం ఎప్పుడు పోయిందో, తన మాటలు అతడు పూర్తిగా విన్నాడో లేదో కూడా పట్టించుకోలేదామె. తన కక్ష తీరింది.

సైలెన్సర్ అమర్చిన రివాల్వర్‌ని హేండ్ బ్యాగ్‌లో పడేసుకుంది.

సూట్‌కేస్‌ని ఖర్చీఫ్‌తో తుడిచి వేలిముద్రలు లేకుండా జాగ్రత్తపడింది.

హేండ్ బ్యాగ్‌లోనుండి కొత్త చెప్పులు తీసుకుని వేసుకుని, పాత చెప్పులు బ్యాగ్‌లో వుంచింది.

చరణ్‌కేసి చివరిసారి చూసాక, అక్కడినుండి బయటకు నడిచింది.

పర్లాంగు దూరంలోనే ఆగి వుందా కారు. ఆమె కారెక్కింది. "బాబాయ్! అంతా నువ్వు చెప్పినట్టే చేసాను" డ్రైవింగ్ సీట్లో వున్న వ్యక్తిని చూస్తూ పలికింది.

"గుడ్! ఆ సూట్‌కేస్‌లో వున్నవి దొంగ నోట్లు. కాబట్టి సి.ఐ. చరణ్ ఏదో కేసుని ఛేజ్ చేస్తూ అక్కడికి వచ్చారనుకుంటారు. అతడి జేబులో వున్న కండోమ్ తను తప్పుచేయడానికే వచ్చాడని తెలిసేలా చేస్తుంది... అతడి కేరక్టర్ తెలిసిన డిపార్ట్‌మెంట్ తను ఏదో సంఘ విద్రోహ చర్య చేయబోతూ హత్య చేయబడ్డాడనే అనుకుంటారు... వీలైతే అతడు క్రైమ్ చేయబోతూ, మరో నేరస్థుడి చేతిలో చనిపోయాడనే విధంగా కేసుని డైవర్ట్ చేస్తాను... దట్సాల్!" అంటూనే కారు ముందుకు దూకించాడు ఏసిపి విఠల్.

దేవసేన ఉరఫ్ మమత కారు సీట్లో వెనక్కు వాలింది. 'ఆమె కనుల ముందు తన చెల్లెలి రూపం కదలాడింది. "చెల్లీ! నీకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్నాను... నాకిప్పుడు చాలా సంతోషంగా వుంది" మనసులోనే అనుకుంది.

★